"సర్! ఏడాది అయింది. ఇంతకాలం డి.ఎస్.గారి బంగళాలో పని చేస్తున్నాను."

"సరే! ఈ కాగితం స్టోరులో ఎస్.ఓ. జోగారావుకిచ్చి గ్లాసు తీసుకురా" అన్నాడు.

"అలాగే సార్!"

శంకరం 'అలాగే' అన్నాడు కాని కదల్లేదు.

"ఏం నిల్చున్నా వేం?"

"అయ్యా ! నా దో మనవి. నా ఫైలు మీద మీరు సంతకం చేస్తే నన్ను ఖాయం చేస్తారు. ఆ ఫైలు..."

"నీ ఫైలు రానీ చేస్తాను. ముం దా గ్లాసు విషయం చూడు." వా డెందుకు వచ్చాడో శ్యామలరావుకి అర్థమైంది.

"గ్లాసు కేం సార్! చిటికలో తెస్తాను. కాని నా ఫైలు...."

"నీ ఫైలు వచ్చినట్లు లేదు. లేక ఈ ఫైళ్లలో ఎక్క డుందో? ముందు నువ్వు నేను చెప్పిన పని చెయ్యి"

"చిత్తం !" అంటూ శంకరం ఇలా వెళ్లినవాడు ఇలా తిరిగొచ్చాడు. అతని వెంట ఎస్.ఓ. రామనాథం ఉన్నాడు.

"శంకరం ! వెళ్లలేదా??"

"సర్ ! లిఫ్ట చెడిపోయింది. అది బాగు అవగానే వెళ్తాను. ఈలోగా నా ఫైలు రామనాథంగారిని మీరు పిలిచారని తీసుకువచ్చేను. వారికైతే నా ఫైలు తేలికగా దొరుకుతుంది."

"సారీ, రామనాథం, నేను పిలవలేదు" అని అతడ్ని పంపించి – "చూడు శంకరం! నువ్వు గ్లాసైనా తీసుకురా లేదంటే చంద్రాన్ని పంపించు."

"వా డెందుకు సార్! నే తెస్తాగా. కాని నా ఫైలు..."

శంకరం వెళ్లిన ఒక గంటకు జోగారావుదగ్గరనుండి ఫోను వచ్చింది.

"మీ ప్యూను ఇప్పుడే వచ్చాడు. సారీ ! గ్లాసులు స్టాకులో లేవు"

"..... ....."

"గ్లాసులు అసలే లేవని కాదు. పై అధికారులకుఇచ్చే గ్లాసులూ, స్టాఫ్‌కి ఇచ్చే సాదాగ్లాసులూ ఉన్నాయి. మీ రేంజ్ ఆఫీసర్లకిచ్చే గ్లాసులు లేవు"

శ్యామలరావుకి కోపం వచ్చింది. "ఏదో ఒక గ్లాసు తగలెయ్యి. మంచినీళ్ళు త్రాగడానికి సాదా గ్లాసు పనికి రానంటుందా?"

